

# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# కరెంటు మాటెత్తితే.. కాట్లె కలుపుడే..








## పొలాలను ఎడారులు చేయాలని కాంగ్రెస్ కుట్రలు

- 10హెచ్‌పీ మోటర్లతో పేద రైతులపై మోయలేని భారం
- పాత పటేల్, పట్వారీ వ్యవస్థను తెస్తామంటూ ప్రగల్భాలు
- సాఫీగా నడిచే ధరణి పోర్టల్ లేకుండా చేయాలని కుట్రలు
- రైతాంగమంతా 24 గంటల కరెంటిచ్చే బీఆర్‌ఎస్‌కే మద్దతు
- కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదంటున్న అన్నదాతలు
- రైతు వ్యతిరేక కాంగ్రెస్ మాకొద్దంటూ నినదిస్తున్న రైతులు

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : కరెంటు మాటెత్తితే కాంగ్రెసోళ్లను కాట్లెకలపడం తప్పదంటున్నారు గ్రామాల్లోని రైతులు, మహిళలు. అప్పట్లోనే ఏడు గంటల కరెంటిస్తామని చెప్పి గద్దెనెక్కి రెండు గంటలు కూడా ఇవ్వకుండా మా రైతులందరినీ ముప్పు తిప్పలు పెట్టారంటూ మండిపడుతున్నారు. మళ్లీ ఇప్పుడొచ్చి మూడు గంటల కరెంటు చాలని, పెద్ద మోటర్లు పెట్టుకోవాలని ఉచిత సలహాలిస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఎన్నికల వేళ కాంగ్రెస్ నేతలు చెబుతున్న 'మూడు గంటల కరెంటు, 10హెచ్‌పీ మోటర్లు, ధరణి పోర్టల్ రద్దు' వంటి అంశాలపై గ్రామీణ ప్రాంతాల రైతులు, మహిళలు, వృద్ధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ ఇస్తున్న 24 గంటల నిరంతర విద్యుత్, వివాదాలకు తావులేకుండా ధరణి పోర్టల్ వంటివి అటు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మంచి పేరు తెస్తున్నాయి. పైగా ఇటు రైతులకూ ఎంతో మేలు చేకూరుస్తున్నాయి. ఈ విషయాలు మింగుడు పడని కాంగ్రెస్ నేతలు ప్రభుత్వంపై నిందలు వేసి ప్రజల్లో అయోమయం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి దుర్బుద్ధిని గమనించిన గ్రామీణ ప్రాంత ప్రజలు, మహిళలు, రైతులు కాంగ్రెస్ నాయకుల అసలు బండారాన్ని, వారి మాటల వెనుక ఉన్న కపటాన్ని బయటపెడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంపై కాంగ్రెసోళ్లకు కన్నుకుట్టబట్టే కరెంటుపై కట్టు కథలు చెబుతున్నారని, కారుకూతలు కూస్తున్నారని ఆరోపిస్తున్నారు. కాడెద్దులతో కర్షకులు పడే కష్టాలు వ్యవసాయం చేయని కాంగ్రెస్ నేతలకు ఏం తెలుస్తుందంటూ ప్రశ్నిస్తున్నారు. సాగుదారుల కష్టాలు తెలిసిన కేసీఆర్ ప్రభుత్వం ఉండగా తమకు మరెవ్వరూ అక్కరలేదని నొక్కి చెబుతున్నారు.

### 20 కుంటలు కూడా తడవదు



మూడు గంటల కరెంటుతో 20 కుంటల పొలం కూడా తడవదు. మళ్లీ గతంలో లాగా కరెంటు కోసం పొలాల వద్ద పడిగాపులు కావాల్సిందే. మంచిగా పంటలు పండుతుంటే ఓర్వలేకనే మూడు గంటలు కరెంటు సరిపోతుందని ప్రచారం చేస్తున్నరు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అరిగోసపడక తప్పదు, ఓటు వేసేటప్పుడు రైతులు ఆలోచించాలి. 24గంటల కరెంటు ఇస్తున్న బీఆర్‌ఎస్‌కే ఓటు వేయాలి.

**– మోదుగు రామకృష్ణ, రైతు, జూలురుపాడు**

### భూ సమస్యలన్నీ తీరినయ్..



ధరణితో భూ సమస్యలు పూర్తిగా తీరిపోయాయి. ధరణి కంటే ముందు ప్రతి ఏటా పహాణీ నకలు తీసుకొని బ్యాంకుల నుంచి రుణం తీసుకోవాల్సి వచ్చేది. పహాణీల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో భూ సమస్యలన్నీ తీరిపోయినయ్. ఆన్‌లైన్‌లో పహాణీ తీసుకొని బ్యాంకులకి వెళ్లి కొత్త రుణాలు, రెన్యువల్స్ చేయించుకుంటున్నాము. ధరణి రావడం వల్ల మాకు రైతుబంధు, సబ్సిడీ విత్తనాలు వస్తున్నాయి. మా భూమికి పట్టా ఇచ్చి హక్కులు కల్పించిన కేసీఆర్‌కే మా మద్దతు.

**– మాలోత్ నర్సింహారావు, రైతు, పాపకొల్లు, జూలూరుపాడు**

### మళ్లీ పాతరోజులే..



కాంగ్రెస్ వస్తే మళ్లీ భూములకు మళ్లీ పాసుబుక్కులు ఇస్తారు. పాత గొడవలు మొదలౌవుతాయి. గట్టు వద్ద పంచాయతీలు ఉంటాయి. పాత కరణాలు వస్తరు. భూమి పంచాయతీ సిచ్చు మొదలైద్ది. ఇప్పుడు రైతులకు చాలా మంచిరోజులు వచ్చాయి. మీటింగ్ పెట్టుకోవాలంటే రైతువేదికలు ఉన్నాయి. ధరణిలో ఒక్కసారి పేరు ఎక్కితే ఇంక ఎవరూ మార్చలేరు. పాసుపుస్తకాలు ఉన్నప్పుడు రోజూ చేల వద్ద పంచాయతీలు ఉండేయి. చలానా కట్టి సర్వే చేస్తరు మళ్లీ పాతగొడవలు బయట పడతాయి. ధరణి ఉండాల్సిందే.

**– సింకిల నారాయణ, రైతు, జూలూరుపాడు**

### విషసర్పాల బాధ తప్పింది



ఉచితంగా ఇస్తున్న కరెంటుతో విషసర్పాల బాధ తప్పింది. గతంలో పొలానికెళ్లి రావాలంటే భయమే. ప్రతీరోజు బతుకుజీవుడా అంటూ జీవనం సాగించేవారం. రాత్రిళ్లు పొలాల్లో నిద్రించాలంటే ఎటు నుంచి ఏ విషసర్పం, కీటకాలు వచ్చి కాటేస్తాయోనన్న భయం ఉండేది. కానీ నేడు రాత్రి కూడా పగలు లాగా కనపడుతుంది. విషసర్పాల భయమే లేదు. ధైర్యంగా వ్యవసాయం చేసుకుంటున్నాం. ఉచిత కరెంటుతో ఎంతోమంది అన్నదాతల ఇంట్లో సుఖశాంతులు వెల్లివిరుస్తున్నాయి. వేలకు వేలు వచ్చే బిల్లు బాధ తప్పింది. తెలంగాణ వాసినని చెప్పుకోవడానికి గర్వంగా ఉంది. నా ఓటు కేసీఆర్‌కే.

**– జాటోత్ అమ్రు, నెహ్రూనగర్, ఒడ్డుగూడెం పంచాయతీ, ఇల్లెందు మండలం**

### కరెంటు, నీళ్లు పుష్కలం



24 గంటల కరెంటు పుష్కలంగా ఉండడంతో పంటలకు నీరు కావాల్సినంత అందుతున్నది. మోటర్లు కాలడం, రిపేర్లు తగ్గాయి. క్వాలిటీ విద్యుత్ వస్తున్నది. మూడు గంటల కరెంటుతో పంటలు ఎండిపోవడం ఖాయం. ఇప్పుడిప్పుడే అప్పులు తీరి రైతులు కడుపు నిండా అన్నం తింటున్నరు. మళ్లీ పాత పాలన అంటే.. మాకు చీకటి రోజులే. మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ కావాలి.

**– సయ్యద్ గఫార్‌మియా, రైతు, తిప్పనపల్లి గ్రామం, చంద్రుగొండ మండలం**

### ధరణి తీస్తే రైతులకు కష్టాలే



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వెంటనే ధరణి పోర్టల్‌ను తీసివేస్తామని చెప్పడం.. ఓ రకంగా రైతులను కష్టాల్లోకి నెడతామనడమే. ధరణి ఉండబట్టే రైతుబంధు పథకం రెండు విడతల్లో వస్తున్నది. ధరణిని తీసివేసి, పాత విధానాన్ని తెస్తే.. రైతులు మళ్లీ రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే. మళ్లీ పట్వారీ వ్యవస్థ వచ్చినట్లే. భూములు ఒకరివైతే.. పట్టాలు మరొకరికి మారుస్తారు. వ్యవస్థ అస్తవ్యస్తమవుతుంది. కేసీఆర్ పరిపాలన మంచిగా ఉంది. మళ్లీ సీఎం కేసీఆర్ సార్ రావాలి. కాంగ్రెస్ పార్టీ మాకొద్దు.

**– భూపతి రమేష్, రైతు, రావికంపాడు గ్రామం, చంద్రుగొండ మండలం**

### ధరణి వల్ల మా భూములకు భద్రత



ధరణి వల్ల ఎంతో ఉపయోగం ఉంది. తెలంగాణ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల భూమి భద్రత కోసం ధరణి ఏర్పాటు చేశారు. ధరణి వల్ల భూములకు భద్రత పెరిగింది. రైతుబంధు, రైతుబీమా మాకు వర్తిస్తున్నాయి. మా తండ్రి చనిపోయిన తర్వాత రూ.5 లక్షల రైతుబీమా వచ్చింది. కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోయే పరిస్థితిలో మేము లేము. కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. మళ్లీ మేం కారు గుర్తుకే ఓట్లు వేస్తాము.

**– పూసం రాజేశ్, రైతు, చిన్న నల్లబెల్లి, దుమ్ముగూడెం**

### రైతులకు ధరణి ఎంతో ప్రయోజనకరం



తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన ధరణి రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. ధరణితో రైతులకు సంబంధించిన భూముల రికార్డులు భద్రంగా ఉన్నాయి. కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలే తప్ప ఏనాడూ మంచి జరగలేదు. రైతులు సుఖంగా ఉన్న తరుణంలో కాంగ్రెసోళ్లు ఇప్పుడు భూమాత అంటూ... ధరణి రద్దు చేస్తామని చెప్పడం హాస్యాస్పదం. రైతులందరూ బీఆర్‌ఎస్‌వైపే ఉన్నారు. మాకు భూమాత వద్దు... ధరణియే ముద్దు.

**– కాటబోయిన చిన్నవెంకటేశ్వర్లు, రైతు, బి.కొత్తగూడెం, దుమ్ముగూడెం**

### ధరణి ఎత్తేస్తే మళ్లీ లొల్లే



ధరణి పోర్టల్‌ను ఎత్తివేయాలని కాంగ్రెసోళ్లు అంటున్నారు. అలా జరిగితే రైతుల మధ్య చిచ్చు పెట్టినట్లే. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రైతుల భూములకు రక్షణ లేకుండా పోయింది. మరోపక్క కరెంటు కష్టాలు. ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు భూ రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకున్నారు. రెవెన్యూ అధికారులు లంచాలు తీసుకుని ఒకరి భూమిని మరొకరికి బదలాయించి రైతులను నట్టేట ముంచారు. ధరణి పోర్టల్ వచ్చాక రైతుల భూముల రికార్డులు భద్రంగా ఉన్నాయి. రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారు. కాంగ్రెసోళ్లు తెచ్చే భూమాత వద్దు... ధరణియే కావాలి.

**– మడకం పెంటయ్య, రైతు, కూనవరం, మణుగూరు మండలం**

### అర్ధరాత్రి చేలోకి వెళ్లాల్సి వచ్చేది



గతంలో కరెంటు ఎప్పుడు వచ్చేదో తెలిసేది కాదు. అర్ధరాత్రి 12.00 గంటలకు పొలంలోకి వెళ్లి పడిగాపులు కాసేది. పాములు ఉండేవో ఏముండేవో తెలిసేది కాదు. కరెంటు వస్తే బోరు వేసి పొలానికి తడి పెట్టేటోళ్లం. వచ్చిన ఆ కరెంటు ఎంతసేపు ఉండేదో తెలిసేది కాదు. కరెంటు పోతే మళ్లీ బోరు దగ్గరకు వెళ్లి, వచ్చే వరకు చూసేటోళ్లం. కానీ ఇప్పుటు అటువంటి ఇబ్బందేమీ లేదు. కరెంటు 24 గంటలు ఉంటున్నది. పగలే పొలం వెళ్లి, బోర్ ఆన్ చేస్తే పొలం తడిసిపోతున్నది. బోర్ ఆన్ చేసి ఇంటికాడ పడుకున్నా పొలం పూర్తిగా తడిసిద్ది. ఇట్లా మా కరెంటు తీర్చిన కేసీఆర్‌కు కాకుండా ఇంకెవరికి ఓటేస్తం..?!

**– మంకిన ప్రసాద్, రైతు, అశ్వారావుపేట**

### ధరణి తీసివేస్తే భూ రికార్డులు ఆగమైతాయి



భూముల రికార్డుల క్రమబద్ధీకరణలో భాగంగా సీఎం కేసీఆర్ రైతుల మేలు కోసం ధరణి ఏర్పాటు చేసి భూరికార్డులను భద్రంగా ఉంచారు. ధరణిని తీసివేస్తే రైతుల భూ రికార్డులు ఆగమైతాయి. మళ్లీ దళారులు వస్తారు. రైతులకు ఇబ్బందులు మొదలైతయి. గతంలో భూరికార్డుల్లో పేర్లు అధికారుల ఇష్టం వచ్చినట్లు మార్చేవారు కానీ ఇప్పుడు ధరణి ఉండడం వల్ల రైతులకు మేలు జరుగుతుంది.

**– మాలోత్ పూల్‌సింగ్, కొత్తతండా పంచాయతీ, మంగ్యాతండా గ్రామం, టేకులపల్లి మండలం**



### రైతులకు దళారుల బెడద తగ్గింది

తెలంగాణ రాష్ట్రం వచ్చాక సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో భూముల భద్రత కోసం ధరణి ప్రవేశపెట్టి రైతులను దళారుల నుంచి కాపాడారు. గతంలో రైతులు వారసత్వం పట్టాలు మార్చలంటే రైతులు మధ్య దళారుల ఆశ్రయించి కొంత డబ్బు ముట్టజెప్పాల్సి వచ్చేది. ఆ తర్వాత అధికారుల వద్దకు వెళ్లి వారికి కూడా కొంత ముట్ట జెప్పితే రైతు సమస్యను పరిశీలించేవారు. కానీ ధరణి వచ్చాక రైతులు నేరుగా మీ సేవకు వెళ్లి ఆన్‌లైన్ చేయాలి. అనంతరం వారిని అధికారులు పిలిచి విచారించి వారం రోజుల్లో నేరుగా లబ్ధిదారుడి ఇంటికే పట్టాదారు పాస్ పుస్తకం వస్తుంది. ఇప్పుడు దళారులను ఆశ్రయించే పని లేదు.

**– భూక్యా రమేశ్, రాంపురం గ్రామ పంచాయతీ పాతతండా, టేకులపల్లి మండలం**

### మూడు గంటలు వద్దు.. 24 గంటలు ముద్దు



తెలంగాణ ప్రభుత్వంలో 24 గంటల విద్యుత్ సరఫరా కావాలి.. కాంగ్రెస్ పాలనలో మూడుగంటల విద్యుత్ వద్దు. ఇప్పుడే రైతులు వ్యవసాయంలో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఈ తరుణంలో రైతుల సుఖం కోరే బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలి. రైతులు కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు.

**– సుబ్బారావు, రైతు, రామారావుపేట, దుమ్ముగూడెం**

### గతంలో ఒక పంటకు కరెంట్ లేదు.. ఇప్పుడు రెండు పంటలకు ఫుల్ కరెంట్



గతంలో ఒక పంటకు సరిగ కరెంట్ లేక నానా ఇబ్బందులు పడ్డాం. కానీ ఇప్పుడు రెండు పంటలకు 24గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక సీఎం కేసీఆర్‌నే అని చెప్పవచ్చు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ముఖ్యమంత్రి కేసీఆర్ అయ్యాక రైతుల కష్టాలను తీర్చేందుకు 24గంటలు ఉచిత కరెంట్ ఇస్తున్నారు. దీంతో మేము మొదటి పంట వరి సాగు చేశాక మళ్లీ కూరగాయలు రెండో పంటకు సాగు చేస్తున్నాం. రైతులకు కేసీఆర్ ఆధ్వర్యంలో పెట్టుబడి సాయం, రైతుబీమా, రైతు రుణమాఫీ వంటి గొప్ప పథకాలను పెట్టిన సీఎం కేసీఆర్ వెంట ఉంటాం.

**– భూక్యా బాలాజీ, బేతంపూడి పంచాయతీ, వెంకిట్యాతండా, టేకులపల్లి మండలం**

### ధరణితో ఇంటికే పాసు పుస్తకం వచ్చింది



నేను అరెకరం కొని, రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను. పాస్ పుస్తం పోస్టు లో ఇంటికే వచ్చింది. ధరణితోనే ఇది సాధ్యమైంది. ఇంతకుముందు ఏడాదిపాటు తిరిగినా పాసు పుస్తకం వచ్చేది కాదు. అప్పుడు ఎకరానికి 20వేల రూపాయలు అడిగేవారు. ఇప్పుడు అలాంటిదేమీ లేదు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నాం.

**– చిన్నంశెట్టి రాంబాబు, రైతు, అశ్వారావుపేట టౌన్**

### ధరణిని తీస్తే మళ్లీ కష్టాలే



గత ప్రభుత్వాల పాలనలో భూమి రికార్డుల బాధలు అన్నీఇన్నీ కావు. పహాణీల్లో తప్పులు ఉండేవి. పేరు మార్పిడి కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా పనులు కాలేదు. రెవెన్యూ అధికారులకు డబ్బులు ముట్టజెప్పాల్సి వచ్చేది. ధరణి పోర్టల్ వచ్చాక రైతుల భూములకు భద్రత కలిగింది. భూమి రికార్డులు పదిలంగా ఉన్నాయి. సర్వ హక్కులు రైతుల భూములకే ఉన్నాయి. ధరణి పోర్టల్‌లో ఏ రైతుకు చెందిన భూమి ఆ రైతుకు భద్రంగా రికార్డుల రూపంలో ఉంది. కాంగ్రెసోళ్లు తెచ్చే భూమాతతో రైతులకు మళ్లీ కష్టాలు వచ్చునట్లేన. కేసీఆర్ పాలనలోనే రైతులకు పూర్తి భద్రత ఉంటుంది.

**– ఎస్‌కె.బికారి, రైతు, అంజనాపురం, బూర్గంపహాడ్ మండలం**

### కాంగ్రెస్ వస్తే కరెంటు కష్టాలే



కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులకు మూడు గంటలు విద్యుత్ చాలనడం.. వ్యవసాయం, విద్యుత్ రంగం మీద వాళ్లకు అవగాహన లేదనడానికి నిదర్శనం. మూడు గంటల విద్యుత్‌తో ఒక్క మడి కూడా తడవదు. 10 హెచ్‌పీ మోటర్లను రైతులు భరించలేరు. అందరూ ఒకేసారి 10 హెచ్‌పీ మోటర్లు వినియోగిస్తే విద్యుత్ గ్రిడ్ మీద భారం పడుతుంది. అధిక లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. 24 గంటల విద్యుత్ వల్ల ఎవరికి అనుకూలించిన సమయంలో వాళ్లు వినియోగించుకుంటారు. రైతులకు అన్నివిధాలా అనుకూలంగా ఉంటుంది.

**– పామర్తి వెంకటేశ్వరరావు, రైతు, జగన్నాథపురం, ములకలపల్లి మండలం**

### ధరణితో రైతులకు మేలు



ధరణి పోర్టల్‌తో రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతున్నది. అన్ని విధాలా ధరణి మంచిది. దీని వల్ల భూ రికార్డులు భద్రంగా ఉంటాయి. భూ రికార్డులకు సంబంధించి ఎలాంటి అవకతవకలు ఉండవు. కాంగ్రెస్ తెచ్చే భూమాతతో రైతులకు మళ్లీ కష్టాలు మొదలైనట్లే. మళ్లీ దళారీ వ్యవస్థ వస్తుంది. పూర్వ పరిస్థితులతో రైతులకు కష్టాలు తప్పవు. బీఆర్‌ఎస్ పెట్టిన ధరణితోనే రైతులకు ఉపయోగం ఉంటుంది. మళ్లీ బీఆర్‌ఎస్సే రావాలి. రైతులకు మంచి జరగాలి.

**– శెట్టిపల్లి భాస్కరరావు, రైతు, తిమ్మంపేట, ములకలపల్లి మండలం**

### ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోతాయి



సీఎం కేసీఆర్ ఏం చేసినా ఆలోచించే చేస్తరు. రైతులకు మంచి చేయడానికే చూస్తరు. గీ కాంగ్రెళ్లను నమ్మితే నట్టేట మునుగుడే. కాంగ్రెసోళ్లు చెప్పినట్లు మూడుగంటల కరెంటు ఇస్తే రైతులకు మళ్లీ కష్టాలు మొదలైనట్లే. ఇగ రైతులందరూ 10 హెచ్‌పీ మోటార్లు పెడితే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోతాయి. ఇగ మల్లా వాటి రిపేర్ల ఖర్చు కూడా రైతుల మీదనే వేస్తరు. అసలు ఎవుసం ఎట్ల చేస్తరనేది కాంగ్రెస్ లీడర్లకు తెలిసనట్లు లేదు. గిప్పుడు రూ.లక్ష సొమ్ముపెట్టి కొత్త మోటర్లు పెట్టడం రైతులకు అసాధ్యం. 24 గంటల కరెంటు ఇస్తనే రైతులు ఒకేసారి కాకుండా వీలైన సమయంలో పంటలకు నీళ్లు పెడతరు. ట్రాన్స్‌ఫార్మర్ల మీద భారం పడదు.

**– గుగులోత్ బాబు, రైతు, చుంచుపల్లితండా, చుంచుపల్లి**

### దళారుల రాజ్యం.. మళ్లీ తెస్తరా..?



గతంలో ఎక్కడ చూసినా భూ సమస్యలే ఉన్నాయి. పేరు మార్చాలన్నా, పట్టా కావాలన్నా.. దళారుల వద్దకు వెళ్లాల్సిందే. వాళ్లు చెప్పినంత ఇచ్చి పని చేయించుకోవాలి. సీఎం కేసీఆర్ సార్ ధరణి పోర్టల్ తెచ్చాక పరిస్థితి మారింది. మళ్లీ కాంగ్రెస్ నాయకులు వచ్చి, ధరణిని రద్దు చేస్తాం...భూమాత తెస్తాం.. అంటూ రైతులను నట్టేట ముంచేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ధరణితో రైతుల భూములు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సకాలంలో పూర్తవుతుంది. భూమి రికార్డులు భద్రంగా ఉంటున్నాయి. కాంగ్రెస్ పాలన వస్తే రైతులకు కష్టాలు దాపురించినట్లే. భూమాతతో రైతులను ఇబ్బందులకు గురిచేసి, వారి జీవితాలతో ఆటలాడుకునే ప్రయత్నం చేస్తున్నది. ధరణి కొనసాగాలి. కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ రావాలి.

**– పాండవుల ధర్మయ్య, రైతు, టేకులచెరువు, బూర్గంపహాడ్ మండలం**

### మూడు గంటలు ఎట్ల సరిపోద్ది..



24 గంటలు కరెంటు ఉంటే రైతులు ఎప్పుడు పడితే అప్పుడు తడిపెట్టుకునే అవకాశం ఉంటుంది. అదే మూడుగంటల కరెంటు ఇస్తే రైతు ఆగమైనట్టే. రైతు నోట్లో మట్టి కొట్టినట్లుంటది. ఎందుకండీ మాకు కాంగ్రెస్‌పాలన. బీఆర్‌ఎస్ పాలన చాలా బాగుంది. రైతుబంధు వస్తుంది, రైతుబీమా కూడా పెట్టారు. కాలువ నీళ్లు వస్తున్నాయి. ఇంజిన్ పెట్టుకున్నా, చేలో మోటర్ వేసుకున్నా కరెంటు కావాలి కదా. కరెంటు మూడు గంటలు ఇస్తే కాంగ్రెసోళ్లను తరిమి కొడతాం. మాకు అన్నీ తెలుసు మంచి నాయకుల్ని ఎన్నుకుంటాం.

**– నంద్యాల రఘుపతి, పల్లిపాడు, ఏన్కూరు**

### కరెంట్ కష్టాలు లేవు



బీఆర్‌ఎస్ పాలనలో కరెంట్ కష్టాలు లేనే లేవు. గతంలో మండలంలోని మామకన్ను వద్ద ఒకే ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఉండేది. ఉమ్మడి గుండాల మండలం(ఆళ్లపల్లి)లో కరెంట్ సరిపోయేది కాదు. ఎప్పుడుపడితే అప్పుడు కరెంట్ పోయేది. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక గుండాలలో మరొక ట్రాన్స్‌ఫార్మర్ కట్టారు. అప్పటి నుంచి అన్ని గ్రామాలకు రోజంతా కరెంట్ ఉంటున్నది. గిరివికాస్ పథకం కింద గ్రామాల్లోని మా గిరిజనులు చాలా బోర్లు వేసుకున్నారు. ఎక్కువగా మొక్కజొన్న, యాసంగి పంటలు పండిస్తున్నారు. కరెంట్ లేకపోతే పంటలు ఎండిపోతాయనే భయమే లేదు. కాంగ్రెస్ వాళ్ళు మూడు గంటలు కరెంట్ ఇస్తామంటున్నారు. వెనకటికి అర్ధరాత్రి కరెంట్‌తో పాములు, తేళ్లు కుట్టేవి. ఆ పరిస్థితులను మళ్లీ తీసుకొస్తామంటున్న కాంగ్రెసోళ్లకు నేను ఓటు వెయ్యను. మంచి పాలన చేస్తున్న కేసీఆర్ కారు గుర్తుకే నా ఓటు.

**–గొగ్గెల రాంబాబు, మోద్దులగూడెం, గుండాల మండలం**

### ధరణితో భూములకు భద్రత



ధరణితో మా భూములకు భద్రత కలిగింది. కాంగ్రెస్ పాలనలో దళారులదే రాజ్యం. రాత పహాణీలో రాత్రికి రాత్రే మారిపోయే హక్కుదార్లు. రైతును రైతుగా గుర్తించడానికి ఏళ్ల తరబడి తిరగాల్సిన దుస్థితి ఏర్పడేది. సెటిల్‌మెంట్లు, అవినీతికి ఆస్కారం లేకుండా సీఎం కేసీఆర్ ధరణిని ప్రవేశపెట్టి రైతులకు మేలు చేశారు. ధరణితో రికార్డులన్ని డిజిటలైజ్ కావడంతో దళారులకు ఇబ్బందులు తలెత్తాయి. గతంలో పహాణీలు చేయించుకునేందుకు పట్టాలు పొందేందుకు గిర్దావర్, వీఆర్‌వో చుట్టూ తిరగాల్సి వచ్చేది. వీఆర్‌వో అందులో రాసిన విస్తీర్ణ ఎంత ఉండేదో తెలిసేది కాదు. అధికారులు ఇష్టం వచ్చినట్లు మార్చేందుకు అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు వాటన్నింటికి కేసీఆర్ చెక్ పెట్టారు.

**– కోరెం రాజు, మొండితోగు గ్రామం, ఇల్లెందు మండలం**

### ధరణితో దళారీ వ్యవస్థ కనుమరుగు



సీఎం కేసీఆర్ సార్ తెచ్చిన ధరణి పోర్టల్‌తో దళారీ వ్యవస్థ పూర్తిగా కనుమరుగైంది. ధరణి పోర్టల్‌తో ప్రతి రైతుకు సంబంధించిన భూమికి భద్రత ఉంది. భూ రికార్డులు భద్రంగా ఉన్నాయి. కాంగ్రెసోళ్లు చెప్పినట్లుగా భూమాత వస్తే.. రైతులకు మళ్లీ కష్టాలే. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు కష్టాలు, భూ సమస్యలు, సాగు పాట్లు.. అన్నీ ఇబ్బందులే. తెలంగాణ వచ్చాక రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. వారి భూములకు సంబంధించిన రికార్డులు భద్రంగా ఉన్నాయి. కాంగ్రెస్‌ను రైతులు, ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. మళ్లీ బీఆర్‌ఎస్సే రావాలి. రైతులకు అండగా ఉండేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే.

**–కొండెం సమ్మయ్య, రైతు, మల్లెలమడుగు, అశ్వాపురం మండలం**

### కాంగ్రెస్ వస్తే కరెంటు కష్టాలే



వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతుందని అంటున్న కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ కరెంటు కష్టాలు వస్తాయి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పాలకుల నిర్లక్ష్యంతో తెలంగాణ గడ్డపై కరెంటు కష్టాలతో ఎంతోమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నరు. మరి కొంత మంది రాత్రి వేళల్లో మోటర్లతో పంటలకు నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌తో చనిపోయారు. అప్పటి రోజులు తలచుకుంటేనే భయంగా ఉంది. మళ్లా తెలంగాణ గడ్డపై ఆ పాత రోజులు రాకూడదు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి రైతు అదే కోరుకుంటున్నాడు. కాంగ్రెస్ నాయకుల మాటలు చూస్తుంటే.. రాష్ట్రంలో వ్యవసాయంపై వారికి పూర్తి అవగాహన లేదని అనిపిస్తున్నది. సీఎం కేసీఆర్ పాలనలో నిరంతరం కరెంటు సరఫరాతో రెండు పంటలు పుష్కలంగా పండుతున్నాయి. రాష్ట్రం సుభిక్షంగా ఉంటాలంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలి. ప్రతి రైతు సీఎం గా కేసీఆర్ సారే ఉండాలని కోరుకుంటున్నారు.

**– బోదా గోపాలకృష్ణారెడ్డి, రైతు, రాజాపురం, అన్నపురెడ్డిపల్లి మండలం**